# ఉషే నిర్ణయం

కుమారి ఉష శ్రీమతి అయింది. ఇంటి పేరు మారింది. తంతులన్నీ ముగిసాయి. ఇక ముఖ్యమైనది శోభనం మాత్రం మిగిలివుంది. రాత్రికి ఆతంతు కూడా పూర్తవుతుంది. తెల్లవారుఝామున బస్సుకు పెళ్ళి వాళ్ళు బయలుదేరతారు. పెళ్ళివారిల్లు అందునా పెళ్ళయిపోయిన పెళ్ళివారిల్లు సద్దుమణిగి నిద్రపోతున్నట్లు వుంది. సాయంకాలం నాలుగు కావస్తోంది. రాత్రి లగ్నం అవడంతో నిద్దర్లు లేని వాళ్ళు నేలమీద చాపలు పరుచుకుని, పెట్టెలమీద దిళ్ళు వేసుకుని గుర్రుకొడుతున్నారు. బాధ్యతగల వాళ్ళు సాయంకాలం పన్లకి శోభనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరి హడావిడిలో వాళ్ళువున్నారు. పక్క గదిలో పంచం మీద పడుకున్న ఉషకి రాత్రల్లా నిద్రలేకపోయినా నిద్ర రావటంలేదు' మనస్సులో ఏదో ఆరాటం, సంతోషం, ఏవేవో ఆలోచనలు. అన్నీ మిళితమైన ఆనందం గిలిగింతలు పెడుతున్నాయి. ఎక్కడెక్కడో ఏవి లోకంలోనో విహరింపచేస్తున్నాయా ఆలోచనలు. పురుషుని పక్కన కూర్చున్న తొలి అనుభూతి. పెళ్ళి తంతుల్లో అతని చెయ్యి పట్టుకున్నప్పుడు ఒకరి శరీరం మరొకరికి తగిలినప్పుడు కలిగిన గగుర్పాటు గుర్తుకొస్తేనే అదోలా అవుతోంది. ఆ స్పర్శకి తన ఒళ్ళు గగుర్పొడిచేది. వెచ్చని అతని స్పర్శలోని అనుభూతి వర్ణించలేనిది. ముక్కూ, ముఖం ఎరుగని ఒక మగవానితో తను ఇక జీవితాంతం కలిసివుండాలని అనుకున్నప్పుడు ఏదో గాబరాగా, భయంగా వుండేది. కానీ ఇప్పుడవన్నీ పటాపంచలయిపోయాయి. ఒక్కరోజులోనే అతనంటే ఇంత అభిమానం, ప్రేమ ఎలా ఏర్పడ్డాయో తనకే తెలీయటంలేదు. నిజానికి ఇంకా పూర్తిగా అతని సాన్నిధ్యాన్ని తను పొందలేదు. ఇక రాత్రితో తను పూర్తిగా రవి సొత్తయిపోతుంది. 'ఇద్దరం ఒంటరిగా ఢిల్లీ వెళ్తాం, కాపురం పెడతాం. అబ్బా ఎంత ఆనందంగా వుంది! పెళ్ళికి ముందు అమ్మా, నాన్నా లేకుండా పరాయి వ్యక్తితో అంతదూరం వెళ్ళివుండగలనా?'' అని అనుకున్న ఉషకి ఇప్పుడు 'రవి లేకుండా బ్రతకడం ఎలా?' అనిపిస్తోంది. మధ్యాహ్నం కలిసి భోజనం చేశారు. అతను విడిదికి వెళ్ళి పోయాడు. రెండు గంటలయింది.

ఇంటి నిండా జనం వున్నారు. ఉదయం నుంచి ఎందరో స్నేహితురాళ్ళు వచ్చి పలకరించి వేళాకోళాలు చేసి వెళ్తున్నారు. కానీ వాళ్ళందరితో మాట్లాడుతున్నా ఆమె, దృష్టి అంతా రవిపైనే వుంది. ముహూర్తం రాత్రి పదిన్నరకిట. అబ్బా ఇంకా ఆరున్నర గంటలు. గడియారం ఆగిపోయినట్లుగానూ, కాలం స్థంభించి నట్లుగానూ వుంది. రాత్రల్లా నిద్రలేదు. అయినా నిద్రరావటం లేదు. ఎవరో వచ్చిన అలికిడి అయితే కళ్ళు మూసుకుంది. తన ఆలోచనల్ని చెదరగొడతారని. ఆ వచ్చిన వాళ్ళు వెళ్ళిపోతూ అంటున్న మాటలు తను వింది. "పడుకోనీయండి, పాపం రాత్రి మళ్ళీ నిద్దర వుండదు" అంటూ నవ్వుకుంటూ తలుపులు దగ్గర వేసి వెళ్ళిపోయారు.

ఇంతలోనే ఉష చెల్లెలు "అక్కా, అక్కా నీకెన్ని వుత్తరాలో" అంటూ ఉషని కుదిపి లేపి చేతిలోని వుత్తరాలకట్టని ఉష ముందు పడేసింది. ఉషలేచి అన్నీ చింపి చూడసాగింది. అందులో చాలామటుక్కు కొత్త దంపతులకి శుభాకాంక్షలు తెల్పే గ్రీటింగులు. అన్నీ తెరిచి చూసి నవ్వుకుంటూ ఓ పక్కన పెట్టింది. మధ్యలో ఓ కవరు కూడా కనపడింది. అది తన చిన్ననాటి స్నేహితురాలు వసుధ రాసింది. అది ఆఖర్ని సావకాశంగా చదవాలని పక్కగా పెట్టి, మిగతావన్నీ చూసి, వసుధ వుత్తరాన్ని తీసింది.

పదవ తరగతి వరకూ తనూ, వసుధ కలిసి ఒకే స్కూల్లో చదువుకున్నారు. ప్రాణమిత్రురాళ్ళిద్దరూ తప్పని సరిగా తన తండ్రి ఉద్యోగరీత్యా విడిపోవలసి వచ్చింది. కానీ వుత్తరాల ద్వారా వారానికి ఒకటి, రెండుసార్లు వారి మనస్సులు మాట్లాడుకునేవి. మధ్యలో కొంత తగ్గినప్పటికీ అప్పుడప్పుడు ఉత్తరాలు రాసుకుంటున్నారు. వసుధ బియ్యే మొదట సంవత్సరం చదివి మానేసింది. తరువాత ఏడాదిలోపలే వసుధకి పెళ్ళి అయింది. భర్త ఢిల్లీలోనే ఇంజనీరు. పదవ తరగతిలో విడిపోయిన మిత్రురాళ్ళిద్దరూ పెళ్ళి అయిన తరువాత, తన భర్తకి కూడా అదే వూళ్లో ఉద్యోగం అవడంతో మళ్ళీ త్వరలోనే కలుసుకోబోతున్నారు. ఆ విషయం తను ఎంతో సంతోషంతో రాసింది దానికే ఈ ఉత్తరం జవాబుగా వచ్చింది. "నాలాగే వసుధ కూడా ఎంతో సంతోషంగా రాసి వుంటుంది" అని పాత జ్ఞాపకాలని నెమరువేసుకుంటూ, చిన్ననాటి స్నేహాన్ని తల్చుకుంటూ ఆ వుత్తరాన్ని చింపి

చదవసాగింది. నాలుగు పేజీల ఉత్తరం. కాగితాలకి ఇరుప్రక్కలా చాలక పక్క కూడా రాసింది. ఉత్తరం అంతా చదివింది, మళ్ళీ చదివింది. జాగ్రత్తగా మడతపెట్టి కవర్లో వుంచి, కవరు సగానికి మడిచి రవికలో పెట్టుకుని పడుకుంది. ఏమిటో ఏదోలా అయిపోయింది తన మనస్సు. ఇంతదాకా వున్న ఉత్సాహమంతా నీరు కారిపోతోంది. ముఖం చాలా సీరియస్‌గా తయారయింది. మనస్సంతా అల్లకల్లోలంగా వుంది. తొలిరాత్రి గురించి ఇంతదాకా తనలోవున్న తీయని తలపులన్నీ ఒక్కసారి మాయమైపోయాయి. వాటి స్థానే ఏదోబాధ ఇది నిజమేనా? ప్రాణస్నేహితురాలు రాసింది. నిజంకాక ఏమవుతుంది? ఈ ఉత్తరం ఒక్కరోజు ముందుగా వచ్చివుంటే తన పరిస్థితి వేరుగా వుండేది. పీటలమీద పెళ్ళి తప్పిపోయిందన్న ఒక్క అపవాదే మిగిలేది. కానీ ఇప్పుడు అన్నీ అయిపోయాయి. తన జీవితంలో రావలసిన ప్రధానమైన మలుపు రాత్రితోవచ్చింది. తనునిన్నటి దాకా కుమారి, ఈనాటి నుంచి శ్రీమతిగా ఒక ఇల్లాలిగా మారి, అందరిలాగే సంసార బంధంలో పడింది. కానీ తనింకా పూర్తిగా తన సర్వస్వాన్ని రవికి అప్పగించకముందే తనకి రవియందుకలిగిన ఈ భావంతో ఎల్లకాలం అతని జీవిత భాగస్వామిగా తను ఎలా వుండగలదు? అన్నదే ఆమె ఆలోచన. 'ఎంత అదృష్టవంతురాలివే తల్లీ! పి హెచ్ డి చేసిన భర్త, రెండువేల జీతం'' అంటూ అందరూ తన అదృష్టాన్ని పొగుడుతుంటే ఎంత గర్వపడేది! కానీ ఇప్పుడు తనది అదృష్టమా? దురదృష్టమా! హే భగవాన్! ఏమిటీమాయ? మగవాళ్లెంత చిత్రంగా వుంటారు? తనకి పురుష స్పర్శ ఇదే మొదటిసారి అయితే రవికి ఈ అనుభవం రెండవసారన్న మాట అసలు రెండవసారనే ఏమిటి? ఇంకా ఎందరిని అనుభవించాడో? ఛి ఛీ తను. దేన్ని అసహ్యించుకునేదో అదే అయింది. వ్యభిచరించే స్త్రీలన్నా, పురుషులన్నా తనకి తగని అసహ్యం. ఏదైతే జరగకూడదనుకుందో అదే జరిగింది. మరిప్పుడేం చెయ్యాలి? పెళ్ళినాడే విడాకులా? లేక అతకని మనస్సుతో లోకం కోసం రాజీపడి, అతనితో జీవితాన్ని, సాగించడమా? ఏది ఏమైనా ఇప్పుడు చెయ్యగలిగిందేమీ లేదు. ఎవరికి తెలిసినా రభసఅవుతుంది. ఇది తనుఒక్కతే పరిష్కరించలేని సమస్య. రాత్రికి రవిని కలిసినప్పుడు ఏదో తేల్చుకుని ఒక నిర్ణయానికి రావాలి'' అనుకుని మనస్సుని సమాధానపర్చుకుంది.

టైము గడుస్తోంది. రాత్రి భోజనాలు అయ్యాయి. తనకి తలంటి పోసారు. పువ్వులజడ వేస్తానంటే వద్దంది. మల్లెపూల మాలని తురుముకుంది. తనకి నచ్చిన చీర కట్టుకుంది. అద్దంలో తన రూపాన్ని చూసుకుంటోంది. ప్రక్కనించి వెళ్తున్న ముత్తయిదవ అంది "శోభనం పెళ్ళి కూతురిలా వున్నావంటారు" అంది వెక్కిరిస్తూ. నిజమే ఎంత చక్కగా వుంది అందగత్తెగా పేరుపొందిన తను ఈ రోజు మరీ అందంగా వున్నట్లు తనకే అనిపిస్తోంది. నవ్వుకుంది.

ఇంతలో తల్లి వచ్చి "రా అమ్మా! పీటలమీద కూర్చోవాలి టైమవుతోంది." అంది రెక్క పుచ్చుకుని. తల్లి వెంట నడిచింది. పురోహితుడు చెప్పినట్లల్లా చేస్తున్నారిద్దరూ అన్నీ అయ్యాయి.' ఇద్దర్నీ గదిలోకి తీసుకెళ్ళేరు. చక్కగా అలంకరించారా గది. మెత్తటి పాన్పు మీద కూర్చోపెట్టి, ముత్తయిదువులకి రవికలగుడ్డలు ఇప్పించారు. తంతులన్నీ ముగిసాయి. అంతా వెళ్ళిపోయారు. అత్తగారు కొంగుని కాసుకట్టి, తెల్లచీర ఇచ్చి బైట గడియపెట్టి వెళ్ళిపోయింది.

రవి దృష్టంతా ఉషమీదే వుంది. తలొంచుకుని కూర్చున్న ఉషని కౌగిట్లోకి తీసుకోబోయాడు. కొద్దిగా వెనక్కి జరిగి చేతిని జాకెట్లోకి పోనిచ్చి వసుధ రాసిన వుత్తరాన్ని తీసి అతనికి అందించి, కళ్ళతో చదవమన్నట్లు అతని కేసి చూసింది. అనుకోని ఈ సంఘటనకి అతను ఆశ్చర్యపడి, "ఇదేమిటీ, ఎవరిదీ నాదా?" అంటూ ఎడ్రసు చూశాడు. "కాదు, నాదే! చదవండి!" అంది ముక్తసరిగా. ఉత్తరం సాంతంగా చదివేడు ఆఖర్ని ఓ నిట్టూర్పు విడిచి "పగ తీర్చుకుంది" అన్నాడు ఆ వుత్తరాన్ని తిరిగి ఇచ్చేస్తూ.

"అంటే మీరూ!" అంది ఉష అర్ధోక్తితో.

"చూడు ఉషా! మనిద్దరం భార్యా, భర్తలం అయ్యాం. ఎంతో నవ్వుతూ, తుళ్ళుతూ మన జీవితం సాగాలి. అందులో తొలిరాత్రి మన జీవితంలో మరువలేని మధురమైన స్మృతుల్ని ముద్రవేయవలసిన ఈరోజు దురదృష్టవశాత్తూ నీకీ వుత్తరం రావడం నిజంగా నా దురదృష్టం. ఈ వుత్తరం మన జీవితంలో పెద్ద అఘాధాన్నే ఏర్పరుస్తుంది. నువ్వే కాదు. ఏ స్త్రీకయినా ఇటువంటి వుత్తరం చదివితే భర్తమీద ఏహ్యభావం కలగడం సహజమే! నిన్ను

నేను నిందించను, కానీ ఒక్క మనవి చేస్తున్నాను. నువ్వూ ఎం.ఏ. చదువుకున్నావు. నే చెప్పేదంతా కూడా విశాల హృదయంతో ఒక్కసారి విని, ఇందులో నే చేసిన తప్పు ఏమన్నా వుంటే చెప్పు. నేను ఈ క్షణం నుంచి నీ జీవితం నుంచి తప్పుకుంటాను. వసుధ నీకు ప్రాణ మిత్రురాలే కావచ్చు ఆమె చెప్పింది నీకు ఎక్కువ నమ్మకంగా తోచవచ్చు కానీ నే చెప్పేది కూడా విని నన్ను కూడా అర్థం చేసుకోమని నిన్ను బ్రతిమాలుతున్నాను." అన్నాడు ఉష గడ్డాన్ని ఎత్తి, ఆమె కళ్ళల్లోకి చూస్తూ. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. రుమాలు తీసి ఆమె కళ్ళని తుడిచాడు.

"చెప్పండి'' అంది ముఖంలో ఏ భావాన్ని కనబర్చుకోకుండా, ముభావంగా.

"అది నేను బి.యస్.సి. ఫైనలియరులో వున్న రోజులు. బి.ఏ. ఫస్టియర్‌లో వసుధ చేరింది. ఆ రోజు కాలేజీడే. వసుధ ఆమె క్లాస్‌మేట్లు కలిసి చిన్న నాటకాన్ని ప్రదర్శించారు. అది కాకుండా ఇంకా అనేక ప్రోగాములు జరిగేయి. అంతా ముగిసేవరికి బాగా చీకటి పడింది. అంతా అయి, అందరం ఇళ్ళకి తిరిగి వెళ్తున్నాం. వసుధ, ఆమె స్నేహితురాలు కలిసి మాకు ముందుగా నడిచి వెళ్తున్నారు. నాతో కలిసి వస్తున్న నా స్నేహితులు నలుగురూ ఎంత వాదించినా వినక వాళ్ళని వెంబడించి చీప్, చీప్ జోక్సు వెయ్యడం ప్రారంభించారు. వాళ్ళిద్దరూ తిరిగి చూశారు నాతో వస్తున్న వాళ్ళు వాళ్ళ ముఖాలు కనబడకుండా వెనక్కి తిరిగి సైకిళ్ళ మీద పలాయన మంత్రం పఠించారు. నేను సైకిలు దిగి, వాళ్ళవెంట నెమ్మదిగా నడిచి వెళ్తూ వాళ్ళకి నా స్నేహితుల తరపున క్షమార్పణ అడిగాను. కానీ వెంటనే వసుధ తన స్నేహితురాలితో "ఇదో వేధవ్వేషమే ఉమా! వాళ్ళని కవ్వించమనడం - తను క్షమార్పణ అడగడం ఇలా అడగ్గానే మనం సినిమాలో హీరోయిన్లల్లా ఐసయిపోయి, వాడి కాళ్ళమీదపడి లా లో పడతామనుకున్నాడు బాగుంది. ఇదోరకం నాటకం. పద రేపు మా నాన్న దగ్గర వాడి సంగతి తేలుస్తా!'' అంది.

వసుధ తండ్రి కాలేజీ ప్రిన్సిపాల్. కూతురంటే అతనికి ప్రాణం. ఆమె ఏం చెప్పినా తండ్రి నమ్మడం సహజం. తండ్రి ప్రిన్సిపాల్ అన్న అహం వసుధలో చాలా ఎక్కువ. అతను తల్చుకుంటే నా జీవితాన్ని సర్వనాశనం

చెసెయ్యగలడు. ఇంతకీ నేను చేసిన తప్పేమీ లేదు. నా స్నేహితులు చేసిన దానికి నేనెందుకు శిక్ష అనుభవించాలి? నేను వెళ్ళి నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలన్నా వాళ్ళని ఏడిపించిన నా స్నేహితులు ఆ కాలేజీలో చదవటం లేదు. అసలు వాళ్ళని ఈ ప్రోగ్రాముకి రమ్మనడమే నా బుద్ధిపొరపాటు. పైగా ఈమె ప్రిన్సిపాల్ కూతురని చెప్పకపోవడం మరో పొరపాటు. దానిపర్యవసానం! నేను దొరికి పోయాను.

అనుకున్నట్లే మర్నాడు ప్రిన్సిపాల్ దగ్గిర నుంచి పిలుపు వచ్చింది. వెళ్ళగానే గదిలో వసుధ ఆమె స్నేహితురాలు కూడా వుండడంతో నేను ఊహించినంతా జరిగిందని అనుకున్నాను."

"గుడ్‌మార్నింగ్ సార్!" అన్న నా మాటలకి కోపంగా నా వైపు ఓ చూపు చూసి 'ఏమిటోయ్ నిన్నరాత్రి జరిగింది నిజమేనా?' అన్నాడు. ఆ వాతావరణం నాకు అనువుగా లేదు. నేను ఏది చెప్పినా అబద్ధమే అవుతుంది. వసుధకి స్నేహితురాలిదన్ను వుంది. పైగా శిక్షించే వాడు తండ్రి. అయినప్పటికీ నేను జరిగింది ఆయనతో చెప్పబోయాను. ఆయన ఏమీవినిపించుకోకుండా గద్దిస్తూ, "నేను అడిగిన దానికి సూటిగా జవాబుకావాలి రవీ! నిన్న జరిగింది నిజమేనా?" అన్నాడు మళ్ళీ.

"యస్ సార్!" అన్నాను విధిలేక. వెంటనే ఆయన నావైపు కోపంగా చూస్తూ "దీని ఫలితమేమిటి అవుతుందో ఊహించావా?" అన్నాడు. ఏమీ జవాబు ఇవ్వకుండా నిల్చున్న నన్ను చూసి "ఏడాది పాటు నిన్ను సస్పెండ్ చేస్తున్నాను తెల్సా? వెళ్ళు ఇంకెప్పుడూ ఏ ఆడపిల్లల్నీ ఏడిపించకుండా నీకిదో గుణపాఠం" అంటూ తన పని చూసుకోసాగాడు. ఏదో చెప్పాలని తపన పడ్డాను. కానీ ప్రిన్సిపాల్ "వెళ్ళిపొమ్మ"ని మళ్ళీ చెప్పడంతో తలొంచుకుని తిన్నగా బైటికి వచ్చేశాడు. వసుధ పొగరుమోతుతనం, అహం ప్రతీ క్షణం నాకు గుర్తుకు వస్తోంది. నాటి ఆమె చర్య నాజీవితం మీద ఎంత దెబ్బతీస్తుందో ఆమె కొంచెమయినా ఆలోచించలేదు. కుటుంబానికి పెద్దవాడినయిన నన్ను నా తల్లీ, తండ్రీ పెద్ద ఉద్యోగస్తుణ్ణి చెయ్యాలన్న ఆశతో ఆస్తిని అమ్మి చదివిస్తున్నారు. ఇప్పుడు నా గతేమిటీ? నేను యమ్మెస్సీ చదివి పి.హెచ్.డి చేయ్యాలను కున్నాను. ఏడాది పాటు నా చదువు నాశనమయితే నా కుంటుంబ పరిస్థితులు

దెబ్బతినడమే కాకుండా, నా భవిష్యత్ అంతా నాశనం అవుతుంది. ఏడాది వెనక పడితే నా భవిష్యత్తుకు కలిగే నష్టాన్ని ఊహించుకున్న కొద్దీ నా రక్తం కుతకుత ఉడకసాగింది. వసుధయందు ఏవగింపు పెరగడంతో పాటు నాలో ప్రతీకార వాంఛ బుసలు కొట్టసాగింది. ఏ విధంగా ఆమె మీద పగని తీర్చుకోవాలా? అని ఆలోచించసాగాను. చెయ్యనినేరానికి ఇంత శిక్షా?

రోజులు గడుస్తున్నాయి నిస్సహాయుడినయిన నేను కాలేజీ, చదువులేక రూమ్‌లో కూర్చుని పిచ్చిగా ఆలోచించడం తప్ప ఏం చెయ్యలేకపోయే వాడిని. పగలు బైటికి వెళ్ళి ఎవరికి నా ముఖాన్ని చూపించలేక పోయేవాడిని. గదిలో తలుపు వేసుకుని కూర్చునే వాడిని. ఒంటరిగా కూర్చున్న నాలో వెర్రి ఆలోచనలు తలలెత్తేవి. బాగా చీకటి పడ్డాకా బీచ్ వైపుకి వెళ్ళి వంటరిగా గడిపి వచ్చేవాడిని. ఒకటి రెండు సార్లు ఆత్మహత్యకి కూడా ప్రయత్నించాను. పిరికి తనం నన్ను అడ్డుకుంది. ఓ రోజు మామూలుగా బీచ్‌నుంచి వస్తున్న నాకు ఒక ఆడపిల్ల నా ముందుగా త్వర త్వరగా నడవడం కనపడింది. గబగబా వెంట నడిచాను. నా అనుమానం నిజం అయింది. ఆమె వసుధే - చేతికందిన అవకాశాన్ని వదలకూడదనుకున్నా. నా రక్తం కుత, కుత లాడింది. ఎన్నడూ లేని ఆవేశంతో కళ్ళు చింతనిప్పుల్లా అవుతున్నాయి. అయినా నాలోని పగ కసి తీర్చుకోమని నన్ను ముందుకు నెట్టింది. ఆమె వెనకే వెళ్ళి ఆమె రెక్క పట్టుకుని నా వైపుకి తిప్పుకున్నా. పెద్ద కేక వెయ్యబోయింది. ఓ చేత్తో నోరు మూసి గుట్టల పక్కకి తీసుకెళ్ళి ఆమె శీలాన్ని చెరిచి నా పగ తీర్చుకున్నా. ఆతరువాత ఆమె మీద నాకు పగ తీరిపోయింది. నా రక్తం చల్లబడింది. నా ఆత్మకి శాంతిగా వుంది. రూమ్‌కి వెళ్ళి రాత్రి హాయిగా పడుకున్నా. ఎలా తెలిసిందో మర్నాడు ఈ వార్త కాలేజీ అంతా పాకిపోయింది. నాలా ఆమె మీద పగబట్టిన వాళ్ళకి, ఆమె తండ్రిచేత శిక్షించబడ్డవాళ్ళకి ఇదో మంచి అవకాశం అయింది. వసుధ గురించి కాలేజీ గోడలమీద స్టూడెంట్లు చెడువ్రాతలు వ్రాసి అల్లరి పెట్టించారు. అవమానంతో వసుధ బి.య్యే ఫస్టియర్ తోటే ఆపేసింది. తలెత్తుకోలేని ఆమె తండ్రి సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు. వచ్చిన సంబంధాన్నల్లా స్టూడెంట్లు చెడగొట్టించే వారుట. తరువాత వసుధ తండ్రి ఆమెను వేరే వూరు తీసుకెళ్ళి అక్కడే పెళ్ళి చూపులు చూపించి, తిరుపతిలో

పెళ్ళి జరిపించినట్లు తెలిసింది. అప్పటికి ఇంకా పగ తీరని కొందరు ఆమె భర్త ఎడ్రస్ తెలుసుకుని ఆమె గురించి ఆకాశరామన్న ఉత్తరం రాశారన్నమాట. మిగతా విషయాలు ఈ ఉత్తరం ద్వారానే తెలుసుకున్నా.

"ఇక నా విషయం. ఆ తరువాత నేను మళ్ళీ కొద్ది నెలలకే కాలేజీలో చేరి నా చదువులో పడిపోయా. జరిగిందంతా ఒక పీడకలగా మర్చిపోయా. నేను అనుకున్నది సాధించా. పిహెచ్.డి అనుకున్న దానికంటే ముందే వచ్చింది. పిల్చి ఉద్యోగం ఇచ్చారు. ఆ సంఘటన ఆనాటితోనే నా మనస్సులోంచి పోయింది. మళ్ళీ వసుధ గురించి నేను ఎన్నడూ ఆలోచించలేదు. నా తలపుల్లోకి ఆమె రాలేదు. కానీ ఈ రోజు నీ ద్వారా ఆమె నీ స్నేహితురాలని, ఆమెకి నా వల్ల ఇంకా అపకారమే జరుగుతోందని ఈ వుత్తరాన్ని చూసేదాకా నాకు తెలీదంటే నమ్ము ఉషా! నిజానికి నా పగ ఉడుకురక్తం ఆనాడు నన్ను అలా పశువులా ప్రవర్తింపచేసింది. పగ తీరిపోయి, నేను అనుకున్నది సాధించగానే నేను జరిగింది మర్చిపోయా. ఆమె నా భవిష్యత్‌ని నాశనం చేసింది. ఆమె మీద తిరిగి దెబ్బతియ్యాలన్న పట్టుదల తప్ప నాలో మరేకోరికా లేదు. ఆమె భవిష్యత్ నాశనమవుతుందని గాని, చెయ్యాలనిగానీ ఎన్నడూ అనుకోలేదు. నావల్ల ఆమె నరకాన్ని అనుభవిస్తోందని ఇప్పుడే తెలుసుకున్నాను. క్షమించు ఉషా! క్షమించు! ఆనాడు అంతకంటే మరో మార్గం లేక ఆ విధంగా ప్రవర్తించాను. ఆమెభర్త దగ్గరికివెళ్లి క్షమార్పణ చెప్పుకొని వారి జీవితాన్ని చక్కదిద్దుదాం ఉషా! అనాడే నాకూ, నీకూ శాంతిగా వుంటుంది. ఢిల్లీ వెళ్ళగానే ముందు వాళ్ళింటికే వెళ్దాం సరేనా? ముందు నువ్వు నన్ను పూర్తిగా అర్థం చేసుకున్నానని చెప్పి నన్ను క్షమిస్తేనే నా మనస్సుకి శాంతిగా వుంటుంది ఉషా!" అని ఆమె చేతులుపట్టుకున్నాడు. అతని కథనంతా విన్న ఉష ఒక్క నవ్వు నవ్వి అతన్ని పెనవేసుకుంది. తీయని రేయి, మరువలేని రేయి అనుకున్న దానికన్నా ఎంతో హాయిగా గడిచింది.

కొత్త కాపరం, కొత్తవూరు. తెచ్చిన సామాన్లు సర్దుకోగానే ఇంట్లో వంట ప్రారంభించిది ఉష. ఎంతో ఆనందంతో వారి కొత్త జీవితం సాగిపోతోంది. ఉదయం ఆఫీసుకి వెళ్తూ అన్నాడు రవి. "ఉషా! సాయంత్రం రెడీగా వుండు మనం మీ స్నేహితురాలి ఇంటికి కరోల్ బాగ్ వెళ్ళాలి! గుర్తుంచుకో!" అంటూ

వెళ్ళిపోయాడు." ఓ.కే. "అంటూ అతనికి టా, టా చెప్పి తలుపేసుకుంది.

సాయంత్రం ఇద్దరూ కలిసి వసుధ ఇంటికి వెళ్ళేరు. వీరిద్దర్నీ చూడగానే వసుధలో కలిగిన ఆశ్చర్యం, అందోళన వాళ్ళు గ్రహించకపోలేదు.

"సర్‌ప్రయిజ్ విజిట్ యిద్దామని కబురు చెయ్యకుండా వచ్చాం వసుధా!" అంది ఆప్యాయంగా. వసుధ యాంత్రికంగానూ మర్యాదకోసం అన్నట్లుగా వారిని ఆహ్వానించి, కూర్చోమందేగానీ ఉష ఆశించిన ఆప్యాయత ఆమెలో కనపడలేదు. రవి మీద కోపం తన మీదకీ మళ్ళి తనని కూడా చులకనగా చూస్తున్నట్లుగా తెలుసుకుంది. కానీ కారణం తెలిసిన తనేమీ బాధపడలేదు.

"నా వుత్తరం అందిందా?" అంది వారిద్దరినీ అదోలాచూస్తూ. "నా వుత్తరం అందినా ఆ నీచుడిని భర్తగా పొందేవా? పొందినా ఇంకా అన్యోన్యంగా వున్నావా? పైగా సిగ్గు లేకుండా నా ఇంటికే వచ్చారా?" అన్నట్లుందా చూపులోని భావం.

"పెళ్ళయిన మర్నాడు అందింది" అన్నాడు రవి తన్నింత వరకూ పలకరించకపోయినా తనంతట తానే మాట కలుపుతూ. ఈ సడింపుగా "నిన్నెవరడిగా" రన్నట్లు చూసి ముఖం తిప్పుకుంది వసుధ. ఇంతలో వసుధ భర్త ఆఫీసు నుంచి వచ్చాడు. తప్పని సరిగా అతనికి తన చిన్ననాటి స్నేహితురాలిగానూ ఆమె భర్తగానూ వారిద్దరినీ పరిచయం చేసింది. ఎంతో ఆప్యాయంగా వారిద్దరినీ పలకరించాడు. అక్కడ కూర్చున్నంతసేపూ వసుధని, ఆమె భర్తనీ గమనిస్తూ, వారి ప్రవర్తనని కనిపెట్టసాగింది. అందరి భార్యా భర్తల్లా కాకుండా టూకీగా మాట్లాడుకుంటున్నారిద్దరు. "అయితే వసుధ రాసిందంతా నిజమేనన్నమాట. అన్యోన్యం, ఆప్యాయత లేకుండా లోకం కోసం ఒకే ఇంట్లో వుంటూ, పరాయివారిలా బ్రతకడం ఎంత దుర్లభం. స్త్రీకి ఇంతకంటే ఇంకేం శిక్షకావాలి?" అనుకుంది.

ఇంతలో టీ పెట్టడానికి లోపలికి వెళ్ళిన వసుధని వెంబడించిన ఉష వంటింట్లోకి ఓ మోడా తీసుకెళ్ళి వసుధ ప్రక్కనే కూర్చుంది.

"ఈ రోజు నిన్ను మేమిద్దరం క్షమార్పణ అడగడానికి వచ్చాం వసుధా! నీ భర్త వచ్చిన ఈ ఒక్కగంటలోనే నీ జీవితాన్నంతా అవగాహన చేసుకోగలిగాను.

నీ వుత్తరాన్ని బట్టి నువ్వెంత నరకాన్ని అనుభవిస్తున్నావో తెలుసుకున్నాను మా మొదటి రాత్రి మేము ఎన్నో తియ్యటి కబుర్లతో గడపవలసినదిపోయి నీ వుత్తరాన్ని మా వారికిచ్చి జవాబు ఇమ్మన్నా" అంటూ ఆ రాత్రి సంఘటనంతా వసుధతో చెప్పింది. అన్నీ విన్న వసుధ "కానీ ఏమయితేనేం? ఇప్పుడు దాని ఫలితం నేను అనుభవించక తప్పుతుందా? ఏ పాపం ఎరగని నేను ఒక శీలం చెడిన ఆడదాన్ని. బలవంతాన్ని నీ భర్త నన్ను చెరిచాడు. దానివల్ల నా జీవితం నాశనం అయింది. నీ భర్త పగ తీరింది. నా భర్తని నేను నిందించను. ఏ భర్త కూడా ఒక సారి చెడిన ఆడదాన్ని భార్యగా స్వీకరించలేడు. అందులో నాభర్త తప్పేమీ లేదు. నా జీవితాన్ని ఇలారంపపు కోతలా తయారుచేసిన నీ భర్తని తలుచుకుని నాలో నేను కుళ్ళిపోతున్నాను. నీ భర్తలా పగబట్టి ప్రతీకారవాంఛ కోసం నాదేహంలోని రక్తంకూడా ఉడుకుతోంది. కానీ ఏంచెయ్యలేని నిస్సహాయురాలిని. అటువంటి నీచుడిని పెళ్ళి చేసుకుని నీ జీవితం నాశనం చేసుకోవద్దన్న భావం తోటే నీకా వుత్తరం రాశాను. ముందుగా అందకపోవడం నీ దురదృష్టం. అయినా ఇన్నీ ఎరుగుండి మీరింత సఖ్యతగా వుండటం నాకు చాలా వింతగా వుంది" అంది ఆవేశం ఆపుకోలేక.

"నిజమే వసుధా! నిజమే! ఆడవాళ్ళకి వున్న సహనం, ఆలోచనాశక్తి, శాంతం మగవాళ్ళలో వుండివుంటే నీ జీవితం ఇలా దుర్భరంగా వుండేది కాదు. నేను నా భర్త తప్పుని, ఆ పరిస్థితిని అవగాహన చేసుకున్నాను. సద్భావంతో అతన్ని అర్థం చేసుకుని మన్నించినట్లు నీ భర్త కూడా క్షమించివుంటే బాగుండేది. ఆ సహనశక్తి నీ భర్తలో వుండివుంటే తప్పుచెయ్యని నిన్ను ఈ విధంగా శిక్షించి, హింసించి వుండేవాడు కాదు. మావారూ, నేనూ నీ సంసారాన్ని చక్కదిద్ది, మీ కాపురాన్ని నిలబెడతాం. ఆ పూచీనాది. ఒక్కసారి నే చెప్పింది ఆలోచించి అర్థం చేసుకోవాసుధా!" అంది.

"ఇంకేం చూడను? మావారు నాకు విడాకులిచ్చే ప్రయత్నంలో వున్నారు. లాయర్‌తో మాట్లాడుతుండగా విన్నాను. ఇంక మీరు శ్రమ పడనక్కర లేదు." అంది వెటకారంగా. "ఇంతేకాదు ఇంకా ఎన్నో వ్యసనాలకిలోనయ్యారు" అంటూ వెక్కివెక్కి ఏడ్వసాగింది.

"నిజంగానా?" అంది బాధగా. ఇంక ఆమెతో ఏమిచెప్పినా ప్రయోజనం

లేదని గ్రహించిన ఉష వెంటనే లేచి హాల్లోకి వెళ్ళింది. "ఏమండి! వసుధని వంటచెయ్యమన్నా. మనం ముగ్గురం ఈ లోపల బజార్లోకి వెళ్ళి వచ్చేద్దాం" అంది రవినీ, వసుధ భర్త శేఖర్‌ని ఉద్దేశించి.

ముగ్గురూ బయలుదేరారు. బజారుకని బయలుదేరిందేగానీ తనకి బజార్లో పనేమీ లేదు. వెళ్తుంటే మధ్యలో కనపడ్డ పార్కులోకి తనే ముందునడిచింది.

"రండి శేఖరంగారూ కాస్సేపు ఇక్కడే కూర్చుని వెళదాం. బజారుకి మరోరోజు వెళ్ళవచ్చు." అంది. ఇదంతా అర్థంకాని శేఖరం ఉషా, రవీల వెంట పార్కులోకి నడిచాడు. పార్కులో ఓ మూలగా జనసంచారం తక్కువగా వున్న జాగాలో కూర్చున్నారు ముగ్గురూ. సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలియటంలేదు ఇద్దరికి. ఆఖరికి ఉషే తెగించి "శేఖరంగారూ! మీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలని మిమ్మల్ని తీసుకొచ్చాం. దయచేసి మేము చెప్పేది పూర్తిగా వినమని ప్రార్థిస్తున్నాం. వింటామంటేనే మేము చెప్పదల్చుకున్నాం" అంది.

ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూసి కొంచెం గ్రహించినట్లుగా నవ్వి 'చెప్పండి వినడానికేముందీ?' అన్నాడు ముందరి కాళ్ళకి బంధం వేస్తున్నట్లు.

"వినడమే కాదు. విన్నాకా మీ నిర్ణయాన్ని కూడా మాకు చెప్పాలి!" అంది.

"చూద్దాం ముందు చెప్పండి" అన్నాడు ఉష రవివైపు చూసి "చెప్పండి" అంది.

అంతదాకా మౌనంగా వున్న రవి శేఖర్ వైపు తిరిగి శేఖరంగారూ మీరు వసుధని క్షమించి, మీ భార్యగా స్వీకరించి, మీ కాపురాన్ని సుఖవంతం చేసుకోమని కోరుతున్నాను. ఆమెకి నా వల్లే సంసార సుఖం లేకుండా పోయింది. ఆదుర్మార్గుడిని నేనే! దీనంతకి కారణం ఏమిటో చెప్తాను విని మీరు మీ నిర్ణయాన్ని తీసుకోండి." అన్నాడు ప్రాధేయపడుతూ.

శేఖర్ ముఖంలో మారుతున్న రంగుల్ని గ్రహించారిద్దరూ. ఇంత దాకా ఆప్యాయంగా మాట్లాడుతున్న శేఖర్‌లో మార్పు రావడం గమనించారు.

" అయితే మీరేనా ఆ మహానుభావులు? మీ పాత ఫ్రెండుని చూడాలని వచ్చారా?" అన్నాడు వ్యంగ్యంగా.

"కాదు శేఖరంగారూ మీరు జరిగినదంతా విని, తరవాత వీని నీ ఇష్టం వచ్చినట్లు నన్ను నిందించండి" అంటూ జరిగిన విషయాన్నంతా మొదటి నుంచీ శేఖర్‌కి వివరించాడు. ఆఖర్ని వసుధ రాసిన వుత్తరాన్ని చదివిన శేఖర్ వారిద్దరివంకా చూస్తూ - "వెరీసారీ! శీలం అన్నది చాలా విలువైనది. ఒకసారి పోయినా పోవడమే. అది పోయిందని తెలిసాక ఏ మగాడూ కూడా ఆమెని భార్యగా స్వీకరించి, ఆమెతో కాపురం చెయ్యలేడు." అన్నాడు ఆ వుత్తరాన్ని మడిచి అందిస్తూ.

"చెడిపోయిన భర్తని భార్యక్షమించినట్లే మీరు వసుధని క్షమించలేరా? అందునా ఆమె చేసిన నేరం ఏమిటి? కాలేజీలో చదివే విద్యార్థుల్లో వుండే వుడుకురక్తం మా ఇద్దరినీ ఆ పరిస్థితుల్లో అలా చేయించింది. అంతేగానీ మా ఇద్దరిలో ఏ ఒక్కరి దోషమూ లేదు. అందులో ముఖ్యంగా వసుధ చేసిన తప్పేమిటి? వసుధే చెడ్డదయివుంటే ఆ విద్యార్థులు తన్ని వెకిలి మాటలన్నారని, పౌరుషపడి తండ్రితో చెప్పివుండేది కాదు. నిజంగా ఆమెలోనే చెడుబుద్ధి వుండి వుంటే, పెళ్ళి చేసుకున్న మీరు ఆమెని ఇంట్లో బంధించి సంసార సుఖం లేకుండా చేసినా కూడా గౌరవంగా, మర్యాదగా ఎవ్వరితో తన గురించి చెప్పుకోకుండా గుట్టుగా మీకు భార్యగానే మీ ఇంట పడి వుండేది కాదన్న సత్యాన్ని గుర్తించండి. ఇంతదాకా మీరు ఇది గ్రహించకపోవడం శోచనీయం. కనీసం ఇప్పుడన్నా ఆమె గురించి నే చెప్పింది నమ్మండి. వసుధ నిప్పులాంటి మనిషి ఆమెకి ఆ మచ్చ రావడానికి కారకుణ్ని నేను. ఇప్పుడు మీరు నన్ను ఎంత ఈసడించినా నేను ఆమె కాపరం నిలబెట్టమని అర్థించడానికి మీ దగ్గరకి వచ్చాను. తప్పుచేసిన నన్ను నా భార్య క్షమించింది. ఆనాడు వసుధ వుత్తరాన్ని చదివి నా భార్యకూడా మీలాగే నన్ను అపార్థం చేసుకుని వుంటే మా ఇద్దరి జీవితాలు ఏమయ్యేవో ఆలోచించండి. ఆమె విశాల హృదయాన్ని ఆమె ఎదురుగానే హర్షిస్తున్నాను. స్త్రీ జాతి యొక్క సహనానికి, ఓర్మికి ఉష ఒక మచ్చుతునక. మనం ఇంకా ఎదగలేదు. ఒకరి తప్పుకి మరొకరిని బాధ్యులుగా చేసి హింసిస్తున్నాం శేఖరంగారూ! ఒక్కసారి ఆలోచించి మా కోరికని మన్నించి,

వసుధని, మీ భార్యగా స్వీకరించండి'' అన్నాడు ఆవేశంతో.

అతనిలోని ఉద్వేగాన్ని ఆవేశాన్ని చూసి తలదించుకున్నాడు శేఖర్. కానీ ఏమీ జవాబివ్వలేదు. రవి ముఖానికి పట్టిన చమటని ఉష తన రుమాలుతో తుడుస్తోంది. ఒకసారి తల ఎత్తి వారిద్దరి అన్యోన్యతనీ చూసి తలదించుకున్నాడు శేఖర్.

"మీరు చెప్పినదంతా విన్నాను. కానీ నేను ఆమెని భార్యగా స్వీకరించలేను. నా మనస్సు దానికి ఒప్పటం లేదు'' అన్నాడు తలదించుకునే. అన్నీ విని కూడా అతనంతగా మూర్ఖపు పట్టుపట్టడం ఉషకి బాగా కోపాన్ని కలిగించింది. అంతదాకా అన్నీ వింటున్న ఉష ఇక తను కలుగజేసుకోకపోతే కుదరదన్నట్లు "అయితే శేఖరంగారూ మీరు చాలా వ్యసనాలకి లోనయ్యారని విన్నాను. మరి మీరు ఏ విధంగా మా వసుధకంటే ఉన్నతులో చెప్పగలరా?'' అంది ఆవేశంగా.

అనుకోని ఈ ప్రశ్నకు చెంపమీద చెళ్ళున కొట్టినట్లయి, దిగ్గున తలెత్తి ఉషను చూసాడు. కోపం, పౌరుషం ముంచుకొచ్చాయి. "ఇది నాస్వవిషయం మీరెవరు ప్రశ్నించడానికి? నేను మగవాడిని!'' అన్నాడు కాస్త అహంభావంతో.

"అయితే ఆ ధీమత్తు తోటే మా వసుధని ఇంట్లో అలా హింసిస్తూ, మీరు మీ ఇష్టం వచ్చినట్లు తిరుగుతున్నారన్నమాట. మా వసుధ చెయ్యని నేరానికే అంత శిక్ష విధిస్తే తెలిసి చెడ్డపన్లు చేసే మీ వంటి వారికి ఎటువంటి శిక్షని విధించాలో ఊహించుకోండి. ఒక్క విషయం - మీతో తిరుగుతున్న ఆ ఆడవాళ్ళంతా మహా పతివ్రతలనా? మీకు కాపురం చెయ్యడానికి శీలవతి కావాలా? స్త్రీ శీలం చాలా అమూల్యమైనదని మీరే అన్నారుకదా? ఆ అమూల్యమైన శీలాన్ని మీరు దోచుకుని ఆ స్త్రీలని వదిలేస్తే రేపు వారి సంసార జీవితం కూడా మా వసుధ జీవితంలా నరకప్రాయం అవదా? మీరు చేస్తున్న పని మాత్రం తప్పుకాదా? మీ తప్పుని మీరు తెలుసుకోలేనప్పుడు ఎదుటి వారి తప్పుల్ని సరిదిద్దగలిగే హక్కు, శిక్షించే హక్కు మీ కెక్కడిది? ఒక్కసారి బాగా ఆలోచించుకుని చెప్పండి. మగవాడిని అన్న అహం తప్ప మీలోవున్న నీతి

ఏమిటి? వసుధలో లేనిది ఏమిటి? ఇప్పుడు మీరు వసుధని క్షమించి భార్యగా స్వీకరించినా ఆమె మీ వ్యసనాలని అసహ్యించుకుని మీతో కాపురం చెయ్యడానికి నిరాకరిస్తే ఏం చేస్తారు? మీ స్వవిషయం మాకు అవసరం లేకపోయినా, నా మిత్రురాలి క్షేమం కోసం మా దంపతులం ప్రాధేయపడటానికి వచ్చాం. మావల్ల ఆమె ఈ నరకాన్ని అనుభవిస్తోంది గనక ఆమె కాపురాన్ని సరిదిద్దే బాధ్యత మాపైనే వుంది. ఆఖరి సారిగా ఒక్కమాట చెప్పుతున్నాను. ఇక నేను మిమ్మల్ని మా వసుధని ఏలుకోమని అర్థించను. మావారిని క్షమించమనీ అడగను. మీ నిర్ణయం మార్చుకుని ఆమెని భార్యగా స్వీకరించలేక పోతే నా నిర్ణయాన్ని వినిపిస్తా వినండి. వసుధకి మీరు విడాకులు ఇచ్చిన తక్షణం ఆమెని మా యింటికి తీసుకువెళ్తా" అంది ఆవేశంగా.

"తీసుకెళ్లి?" అన్నాడు ప్రశ్నార్థకంగా.

"తీసుకెళ్ళి వసుధని ఒప్పించి, వసుధకి, రవికీ రిజిస్ట్రీ మేరేజీ జరిపించి మిత్రురాళ్ళల్లా అక్కచెల్లెళ్ళం అవుతాం. రవి వల్ల ఆమెకి అన్యాయం జరిగింది గనుక ఆమె జీవితాన్ని చక్కదిద్దవలసిన బాధ్యత మావారికీ వుంది. అందుకు ఆయన స్వీకరించక తప్పదు. ఇదేనా నిర్ణయం" అంటూ "పదండి వెళదాం" అని ఉష రవితో బస్టాప్ వైపుకి చకచకా నడిచివెళ్ళిపోసాగింది. వెళ్ళిపోతున్న ఆ దంపతుల్ని అచేతనంగా నిలబడిపోయి చూస్తూ 'వారి అన్యోన్య దాంపత్యానికి కారణం ఆమెలోని క్షమా శక్తేకదా!' అని మనసులో ఆమెని అభినందించకుండా వుండలేక పోయాడు శేఖర్.

"తనలో కూడా ఉషలో వున్న క్షమా శక్తి వుండివుంటే తన సంసారం కూడా ఆనందడోలికలో ఊయలలూగేది కదా?" ఈ నిజాన్ని వారివద్ద ఒప్పుకోలేక పోవడానికి తనలోని పురుష రక్తం అడ్డినప్పటికీ, మనస్సు తనలోని తప్పుల్ని ఒప్పించి, తమ దాంపత్యాన్ని కూడా పూలబాటలో మళ్ళించాలని ప్రయత్నిస్తోందని శేఖర్‌కి మాత్రం తెలుసు.

(ఫిబ్రవరి 1981 స్వాతి)